# ఆంకోసెర్సియాసిస్?

వేమల్ల మీనాక్షిదేవి



**మంచినిద్రలో** ఉండగా మెలకువ వచ్చింది చటుక్కున. కళ్ళు మండుతున్నాయి. నీరు చిమ్ముతోంది. పడుకునేవరకు నిక్షేపంలాగా ఉన్నాయి. ఇంతలో ఈ మార్పేమిటి? టైమ్ ఎన్నెండయింది. లేచి చల్లని నీళ్ళతో కళ్ళు కడుక్కుంది. నలక పడ్డట్లుంది. నిద్ర పట్టలేదు. ఎర్రబడి ఇరుకుని పడ్డాయి కళ్ళు.

వారుణికి కంటి కేదైనా వస్తే! అసలు వస్తుందన్న భావం కలిగితేనే భయం. ఏపాటి తేడా ఉన్నా ఆక్రోమైసిన్‌గాని, క్లోరామైసిన్‌గాని వాడుతుంది. ఎప్పుడూ ఆ మందు ఆమె దగ్గర ఉంటుంది. లేచి వెళ్ళి ఆ ఆయింటుమెంటు పెట్టుకుని పడుకుంది.

ఇప్పు డంతటా కంజెంటివైటిస్ అందరికీ వస్తోంది. ఒకరికి వస్తే ఇంట్లో అందరికీ వస్తోందట. దానికి మందు వచ్చిందట. ఆ డ్రాప్సు తెప్పించి వెయ్యాలి తెల్లవారాక అనుకుంది ఆమె.

ఇంతకీ అదేదో కొత్త జబ్బు కాదట. ఇంతా చేసి అది కళ్ళ కలకకి నామాంతరమని ఎవరో చెప్పుకుంటూంటే వింది. అది ఎంతవరకు నిజమో తెలియదు.

మర్నాడు అద్దంలో చూసుకునేసరికి కుడి కంట్లో సన్నని పొరలాగ మెరుస్తోంది. అమ్మ బాబోయ్! కంట్లో ఏదైనా బయలుదేరితే... పై ప్రాణాలు పైనే పోయాయి. ఆ రోజు వారుణికి ఏ పనీ చేయబుద్ధి కాలేదు. తిండి తినలేకపోయింది సరిగ్గా. విశ్రాంతిగా పడుకోలేకపోయింది.

ఒకటే బెంగ.

నిక్షేపంలాంటి కంటికి ఈ మార్పు ఏమిటి?

దీని పరిణామం ఎలా ఉంటుందో?

ఒక రోజుకే కన్ను మసకగా అయిపోయింది. చింతుకుని ఉన్నట్లుంది రెండు కళ్ళూ ఒకలాగ కనబడక. ఇలాగే శేష జీవితం గడపాలా...లేక ...అన్నట్లు ఇది క్రమంగా ముదిరి దట్టమై... అసలే కనబడని పరిస్థితి రాదు కదా! భావాలు లేకపోయినా రాయవచ్చును గాని, కళ్ళు లేకపోతే రాయడం ఎలా?

వారుణి తాతగారు అంధుడు. ఆయనకి అంధత్వం మధ్యనే వచ్చిందట. కూడా ఎవరో ఉండి తీసుకుని వెళ్ళేవారు ఆయన ఎక్కడికి వెళ్ళవలసివచ్చినా.

ఎవరికైనా కంటికి ఏ పాటి బాధ వచ్చినా ఖంగారుపడిపోయే వా రాయన. వెంటనే డాక్టర్‌కి చూపించి వైద్యం చేయించేవారు.

''కన్నే మన్నే'' అన్నారు.

''కన్నులేనిదే కలియుగమేలేదన్నారు''

''సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'' అనీ అన్నారు పెద్దలు. వారుణికి ఏమీ తోచడం లేదు. వాళ్ళ ప్రక్క ఇంట్లో ఒక అబ్బాయి డాక్టరున్నాడు. అతనిని సలహా అడిగింది.

''ఈ వూళ్ళో డాక్టర్ మూర్తిగారు కంటి స్పెషలిస్టు. ఆయన అందరిలాగా కాదు. సైంటిఫిక్ దృక్పథంతో చూస్తారు. ఒక్కసారు మీ కంట్లో లైటు వేసి చూడగానే కంప్లైయింట్ ఏమిటో తెలిసిపోతుంది. ఆ తరువాత మందు వేసి పరీక్ష చేసినప్పుడు ఆయన అనుకున్నదే ఆ పరీక్షలో తేలుతుంది. అక్కడికి వెళ్ళండి. మేము అవసరం వస్తే ఆయన దగ్గరకే వెడతాం'' అంటూ ఆ ఆస్పత్రికి గుర్తులు చెప్పాడు ఆ డాక్టర్ అబ్బాయి.

డాక్టర్ మూర్తిగారి ఆసుపత్రికి వెళ్ళి అక్కడ ఉన్న ఒక బెంచీ మీద కూర్చుంది వారుణి.

ఎదటి బెంచీలమీద స్త్రీలు, పురుషులు చాలా మంది ఉన్నారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ.

ఒక ముసలామె డాక్టర్‌గారి గది నుండి తడుముకుంటూ వచ్చింది.

''ఆపరేషన్‌కి ఇంకా ముదరాలట. ఏం ముదరడమో ఏమిటో...నాకేమో ఏమీ కనబడదు. ఇంకా కనబడకుండా పోవాలట'' అంటూ నుదురు కొట్టుకుంది.

వారుణి గుండె జారిపోయింది. తన కేసు అటువంటిది అవదు కదా? ఆపరేషన్ చేసినంతమాత్రాన కన్ను వస్తుందన్న గ్యారంటీ లేదు. అటువంటి ఒక కేసు తను ఎరుగును. వాళ్ళ అన్నయ్యకు కాటరాక్టు. అతని కుమార్తె కంటి డాక్టర్. ఆయనది పెద్ద వయస్సు. రెండేళ్ళ నుండి ఆపరేషన్ చెయ్యాలనుకోడం వింటున్నది. ఇప్పటికీ ఇంకా జరగలేదు. ఇంకా టైమ్ పడుతుందట.

కన్ను కనపడకపోవడం ఎంత బాధో! ''టెల్ మీ వాటీజిట్ యు కాల్ లైట్'' అన్న లేమెంట్ ఆఫ్ ది బ్లైండ్ బాయ్ పద్యం గుర్తుకు వచ్చింది. అసలు చూపే ఎరుగని కుర్రవాడు పాపం. రాత్రి అంటే చీకటి అని చెప్పడానికి వాడికి రాత్రీ, పగలూ చీకటే కదా!! పగలు సూర్యరశ్మివల్ల వెచ్చదనం తెలుస్తుందంతే.

మిల్టన్ మహాకవి అంధుడు. ఆయన అంధత్వాన్ని గురించి అక్కడక్కడ తన పాత్రలచేత అనిపిస్తాడు. ''ఐ కెన్ ఎవర్ సీ దీవెన్ ఐయామ్ డినైడ్ లైట్'' అంటాడు. శాంసన్ ఎగోనిస్టిస్‌లో శాంసన్ కళ్ళు శత్రువులు పొడిచేస్తారు. అతడికి గాజా ద్వీపంలో ప్రవాసం విధిస్తారు. శరీరబలం ఎంత ఉన్నా దృష్టి పోవడంవల్ల దీనంగా విలపిస్తాడు. ఇవన్నీ గుర్తుకు వచ్చాయి వారుణికి. ఆమె విద్యావతి.

అంధత్వం ఎంత భయంకర మైనది అనుకుంది వారుణి.

ఒక్కొక్కరినే పిలిచి లోపలికి పంపుతూంది నర్సు.

తన కంటి గురించి డాక్టరుగారు ఏమంటారో? భయం చేత తన అనుమానమేనేమో! కొంప తీసి కాటరాక్టే అనరు కదా! అదే అయితే చూపు

క్రమంగా తగ్గిపోతుంది. పనులకు కూడా ఒకరి సహాయం అవసరం అవుతుందా? భగవాన్! ఆ పరిస్థితి రానియ్యక... ఇంకా ఎన్నో రచనలు చేయాలనుకుంటున్నాను. నిత్యం రాసుకుంటూ, చదువుకుంటూ కాలక్షేపం చెయ్యడమే కాదు. కాలమే తెలియకుండా రోజులు గడిచిపోయే తనకి కంటి కేదైనా వస్తే... ఇంక ఏమీ రాయలేదా? చదవలేదా?. అయ్యో! కాలం ఎలా గడుస్తుంది? దుర్భరమైన అటువంటి బ్రతుకు బ్రతకడం కంటె ఇంత...'

"మీరు లోపలికి వెళ్ళండమ్మా" అంది వారుణి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ నర్సు.

ఒక్కసారి ఒళ్ళు జల్లుమంది.. నరనరాల్లోనూ వణుకు.

చాలా కాలం నుండి ఆ డాక్టరుగారి పేరు వింటూంది తను. అందరూ పొగుడుతూ ఉంటారు. తమ రైతు అక్కడే కంటికి ఆపరేషన్ చేయించుకున్నాడు. డాక్టరుగారు బాగా పెద్దవాడై ఉండాలి. పెద్దతనం వల్ల ఓపిక తగ్గి కఠినంగా మాట్లాడతాడా? భయపెడతాడా? వెనకటికి ఒక లేడీ డాక్టరు తన దగ్గరకు వచ్చిన వారితో 'ఇన్ని వస్తువులు పెట్టి తీసుకుని వచ్చావు ఏమి అమ్మాయిని. సరియైన వైద్యం చేయించకపోతే చస్తుంది' అనేది అతి కరుకుగా. వాళ్ళు హడిలిపోయి ఆమె అడిగినంత డబ్బు ఇచ్చి వైద్యం చేయించేవారు. ఈయన అలా బెదరగొట్టడు కదా. ఆరు నెలలకి పోయే ప్రాణం అప్పుడే పోతుంది.

మెల్లగా తలుపు తోసుకుని లోపల అడుగు పెట్టింది వారుణి.

"ఇలా కూర్చోండి" అని ఒక స్టూలు చూపించింది అక్కడి నర్సు.

తలెత్తి డాక్టరుగారిని చూసింది ఆమె. ఆయన్ని చూడగానే దూరాన ఉన్న తన కొడుకు గుర్తు వచ్చాడు.

'చిన్నవాడే ఈయన' అనుకుంది వారుణి.

"కళ్ళు తెరవండమ్మా" అని కళ్ళలోకి లైటు వేసి చూశాడు డాక్టరు.

చూడ్డం అయ్యాక నర్సు బయటకు తీసుకుని వెళ్ళి ఒక గదిలో కుర్చీలో కూర్చోబెట్టి రెండు కళ్ళల్లో డ్రాప్స్ వేసింది.

కళ్ళుమూసుకుని కూర్చుంది వారుణి.

తన కొడుకులలో ఒకడు డాక్టరు. ఆ అబ్బాయి పుస్తకాలలో డిస్నీ రాసిన 'హాండ్‌బుక్ ఆఫ్ ఆప్తాల్మాలజీ'లో ఉన్న జబ్బుల పేర్లు జ్ఞాపకం వచ్చాయి. ట్రకోమా—గ్లకోమా ఆంకోసెర్సియాసిస్ మొదలైన జబ్బుల గురించి రాశారందులో.

"ఒరే అబ్బాయ్. ఆంకో సెర్సియాసిస్ అంటే ఏమిటి?" అని అడిగింది తను.

"ఏం అమ్మా! ఆప్తాల్మాలజీ చదువుతున్నావా? అది నీ కేం తెలుస్తుంది? ఆ జబ్బు మన దేశంలో ఉండదు. ఆఫ్రికాలోను,అమెరికాలోను అక్కడక్కడ ఉండే జబ్బు అది. ఆఫ్రికాలో సెటిలయిన ఇంగ్లీషుడాక్టరు రాశారీపుస్తకం" అని ఆ పుస్తకం చేతిలోంచి లాక్కున్నాడు. పైగా అన్నాడు—"మేము థర్డ్ ఇయర్‌లో పెథాలజీ చదివేటప్పుడు అందులో ఉన్న జబ్బు లన్నీ మాకున్నా యనుకునే వాళ్ళం. మహా తల్లీ. ఆ పుస్తకాలు తియ్యకమ్మా, వీటిలో ఉన్న వన్నీ నీ కున్నాయని బాధపడ్డం ప్రారంభిస్తావు" అని.

అదంతా జ్ఞాపకం వచ్చింది.

తనకు వచ్చినది మూడు నాలుగు అక్షరాల జబ్బు అయి ఉండదు. ఇదేదో పొడవాటి జబ్బే అయి ఉంటుంది. లేకపోతే తమ ఫ్యామిలీ డాక్టరు తనను ఈయన దగ్గర కెందుకు వైద్యానికి పంపుతాడు అనుకుంది వారుణి.

కళ్ళలో మందు వేసి గంటఅయింది. డాక్టరుగారి దగ్గరకు తీసుకునివెళ్ళింది నర్సు.

అంతవరకువెలుగుతున్న పెద్దలైటు ఆరిపోయింది. గదిచిమ్మ చీకటి అయింది

ఇదివరకు లాగే కళ్ళలో లైటు వేసి చూస్తున్నారు డాక్టరుగారు.

కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయి, చివరగా తీర్పు చెప్పే రోజున జడ్జి ఏం తీర్పు చెబుతాడో అని ఎదురు చూసే ముద్దాయి లాగా ఉంది ఆమె మనస్సు.

ఏం జబ్బు ఉంది అంటాడో?

తన ఇష్ట దైవాన్ని మనస్సులో ధ్యానించుకుంటూంది వారుణి.

"ఏం జబ్బు లేదమ్మా. కళ్ళకి జోడు వేసుకోవాలి. పరీక్ష చేసి అద్దాలు రాసిస్తాను" అన్నాడు డాక్టరు. ★

**(అంధులకు అంకితం)**

